ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.7 । కనిష్ఠం 19.4
కామారెడ్డి జిల్లా వార్తలు
5
సోమవారం 7 ఏప్రిల్ 2025



కామారెడ్డి బస్టాండ్‌లో సమస్యలను పరిష్కరించాలి

- కామారెడ్డి ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీసీ డీఎం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి ఆర్టీసీ డీఎం కరుణశ్రీ ఆదివారం ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కామారెడ్డి బస్టాండ్‌లో నెలకొన్న సమస్యలపై ఆయనకు వివరించారు. నీటి వసతి లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారని తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తనవంతు సహకారం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ జయరాం, లింగమూర్తి, ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లుగా ఉత్తిపోతలే..!



అసంపూర్తిగా నిలిచిపోయిన నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు

- నత్తనడకన నాగమడుగు ఎత్తిపోతల పథకం
- పంప్‌హౌస్, ఆనకట్టల బెడ్డు నిర్మాణానికే పరిమితం
- రూ.475 కోట్లతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన పథకం
- సకాలంలో నిధులు మంజూరు చేయక ముందుకు సాగని పనులు
- నిధులు లేక భూ సేకరణ చేయలేని పరిస్థితి
- 51 ఎకరాలకు గాను 10 ఎకరాల భూమి మాత్రమే సేకరణ
- 40 వేల ఎకరాలకు సాగు నీరు అందించడమే ఈ పథకం లక్ష్యం
- సాగునీరు అందక ఆయకట్టు కింద ఎండుతున్న పంటలు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా పనులు పూర్తి చేయాలని రైతుల డిమాండ్

కామారెడ్డి, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గం ఈ ప్రాంత ప్రజలంతా ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవనాన్ని కొనసాగిస్తుంటారు. నిజాంసాగర్, కౌలాస్‌నాలా వంటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ ఈ నియోజకవర్గ పరిధిలో ఏ మండలానికి సాగునీరు అందదు. ఇక్కడి ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించేందుకు నిజాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన మంజీరా నదిలో నాగమడుగు ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి జుక్కల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 40 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగు సంవత్సరాల కిందట ఈ పథకాన్ని ప్రారంభించినప్పటికీ సరిపడా నిధులు కేటాయించకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. ఈ పథకం పనులు పూర్తికాకపోవడంతో ప్రతీ యాసంగి సీజన్‌లో ఇక్కడి పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం నల్లవాగు కాలువల మరమ్మతులు చేసి సాగునీరు అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నత్తనడకన నాగమడుగు ఎత్తిపోతలు

జుక్కల్ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో బీడు భూములకు నీరు పారించేందుకు ప్రతిపాదించిన నాగమడుగు ఎత్తిపోతల పథకం నాలుగేళ్లుగా ముందుకు సాగడం లేదు. రూ.475 కోట్ల అంచనా వ్యయంతో 40 వేల ఎకరాలకు సాగు నీరు అందించేందుకు ఈ ఎత్తిపోతల పథకాన్ని డిజైన్ చేశారు. నిజాంసాగర్ మండలంలోని వడ్డెపల్లి, జక్కపూర్ గ్రామ శివారుల్లో ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని చేపట్టారు. మంజీరా నదిలోంచి ఈ పథకం ద్వారా నీటిని ఎత్తిపోసి బిచ్కుంద మండలంలోని వడ్లం చెరువు వరకు తరలిస్తారు. ఇక్కడి నుంచి గ్రావిటి ద్వారా పిట్లం, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, జుక్కల్ మండలాల్లోని 40 వేల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని పనులు చేపట్టారు. దీంతో నాలుగు మండలాల్లోని వేల ఎకరాల భూములు సస్యశ్యామలం అయ్యే అవకాశం ఉంటుంది. కానీ ఎత్తిపోతల పథకం పనులు మాత్రం ముందుకు కదలడం లేదు.

ఆనకట్ట, పంప్‌హౌస్ బెడ్ల నిర్మాణానికే పరిమితం

నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు ఆనకట్ట పంప్‌హౌస్ బెడ్ల నిర్మాణానికే పరిమితమైంది. రూ.475 కోట్లతో ఈ పథకం కింద చెక్‌డ్యాంతో పాటు పంప్‌హౌస్ నిర్మాణాలతో పాటు సుమారు 10 కిలో మీటర్ల వరకు కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు సుమారు రూ.50 కోట్లతో మాత్రమే కేవలం చెక్‌డ్యాం, పంప్‌హౌస్ నిర్మాణం చేపట్టగా అవి కూడా బెడ్డు నిర్మాణ దశలోనే పనులు నిలిచిపోయాయి. అదేవిధంగా నాలుగు మండలాల్లోని 48 గ్రామాల పరిధిలో గల రైతాంగానికి సాగునీరు అందించేందుకు సుమారు 10 కిలో మీటర్ల మేర కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ కాలువల నిర్మాణం కోసం 51 ఎకరాల భూసేకరణ చేపట్టాలి. ఇందులో భాగంగా మొదట 11 ఎకరాల వరకు భూసేకరణ చేపట్టి ఒక్కో ఎకరానికి రూ.17 లక్షల చొప్పున ప్రభుత్వం నష్టపరిహారం అందించింది. అనంతరం భూసేకరణకు, పథకం నిర్మాణ పనులకు అప్పటి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని సంబంధితశాఖ అధికారులు చెబుతున్నారు.

నిధుల కేటాయింపులో గత ప్రభుత్వం నిర్లక్ష్యం

2021లో అప్పటి ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ నాగమడుగు ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మొదట్లో కొంతమేర నిధులను అప్పటి ప్రభుత్వం మంజూరు చేయడంతో చెక్‌డ్యాం, పంప్‌హౌస్‌ల బెడ్డు నిర్మాణాలు చేపట్టారు. తర్వాత ఈ పథకానికి అప్పటి ప్రభుత్వం నిధులు పూర్తిస్థాయిలో కేటాయించలేకపోయింది. దీంతో పనులు ముందుకు సాగలేదు. పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌లకు సైతం పూర్తిస్థాయిలో బిల్లులు రాక మధ్యలోనే పనులను నిలిపివేశారు. 2014, 2018 ఎన్నికల సమయంలో జుక్కల్ ప్రాంతానికి ప్రచారం నిమిత్తం వచ్చిన అప్పటి సీఎం కేసీఆర్ నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసి రైతాంగానికి సాగు నీరు అందిస్తామని హామీ ఇస్తు వచ్చారు. కానీ గత ఐదేళ్లలో అధికారంలో ఉన్న కేసీఆర్ నిధులు కేటాయించలేకపోయారు. దీంతో పనులు జరగలేదు.

సాగు నీరు అందక ఎండుతున్న ఆయకట్టు పంటలు

జుక్కల్ నియోజకవర్గంలోని జుక్కల్‌తో పాటు పిట్లం, పెద్దకొడప్‌గల్, బిచ్కుంద, నిజాంసాగర్, మద్నూర్ మండలాల్లో సాగునీటి వసతులు లేక ఇక్కడి రైతాంగం ఎక్కువగా ఆరుతడి పంటలనే సాగు చేస్తుంటారు. వర్షాకాలం సీజన్‌లో వర్షాలపై ఆధారపడి రైతులు పంటలు సాగు చేస్తున్నారు. యాసంగిలో మాత్రం స్థానికంగా ఉండే వాగులు, చెరువులపై ఆశలు పెట్టుకుని జొన్న, సోయా, పత్తి, శనగ పంటలను వేల ఎకరాల్లోనే సాగు చేస్తారు. నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే వడ్లం చెరువు, నల్లవాగు ద్వారా వేల ఎకరాలకు సాగు నీరు అందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం నల్లవాగు ద్వారా మాత్రమే అడపాదడపగా సాగునీరు అందుతోంది. ఈ నల్లవాగు చెరువు కాలువలను ఆధునీకరించకపోవడంతో పంటలకు సాగునీరు అందడం లేదు. ఈ చెరువుకు సంబంధించి కాలువలను ఆధునీకరిస్తే పంటలకు సాగు నీరు అందుతుందని ఇక్కడి రైతులు చెబుతున్నారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైన నాగమడుగు ఎత్తిపోతల పథకం పనులు పూర్తిచేసి ఆయకట్టుకు సాగునీరు అందించాలని ఇక్కడి రైతులు డిమాండ్ చేస్తున్నారు.



కన్నుల పండువగా
సీతారాముల కల్యాణ మహోత్సవం



ఇందిరానగర్‌లో స్వామి వారి విగ్రహాలను తీసుకువస్తున్న భక్తులు





కామారెడ్డిలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

- శ్రీ రామ నామస్మరణలో తరించిన భక్త జనులు
- జిల్లా కేంద్రంలో హిందూవాహిని ఆధ్వర్యంలో శోభాయాత్ర
- భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీల ప్రతినిధులు

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో స్వామి వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు స్వామి వారి కల్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని ఆయా వార్డుల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ధర్మశాల వద్ద నుంచి హిందూవాహిని ఆధ్వర్యంలో శ్రీరాముడి శోభాయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో యువకులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేశారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం

కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో, ఐదుగుళ్ల, ధర్మశాలలో, రామాలయంలో, పంచముఖి హనుమాన్, శ్రీరాంనగర్ కాలనీ ఆలయంలో, సీతారామంజనేయ ఆలయం, అడ్లూర్, చిన్న మల్లారెడ్డి, లింగాపూర్ వేంకటేశ్వరాలయంలో తదితర ఆలయాలను అందంగా అలంకరించబడిన ముత్యాల పందిరిలో వేలాది మంది భక్త జనులు చూడగా సీతారాముల కల్యాణం ఘనంగా వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందిరానగర్‌లో ఆలయం వద్ద నూతన విగ్రహాలను దాతలు అందించగా వాటిని ఊరేగింపుగా తీసుకుని వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విద్యానగర్ సాయిబాబా ఆలయం వద్ద భక్తులు కోలాటాలతో సీతారామాంజనేయ విగ్రహాలను మహిళలు కోలాటాలు ఆడుతూ ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. ఇందులో భాగంగా వందలాది జంటలు పాల్గొని సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. అమ్మవారికి భక్తులు ఓడి బియ్యం, పట్టు వస్త్రాలు సమర్పించి వారి మొక్కులు తీర్చుకున్నారు.

కామారెడ్డిలో శ్రీరాముడి శోభాయాత్ర

శ్రీరామనవమి పురస్కరించుకొని కామారెడ్డి జిల్లా కేంద్రంలో హిందూవాహిని ఆధ్వర్యంలో శ్రీరాముడి విగ్రహంతో భారీ ఎత్తున శోభాయాత్రను నిర్వహించారు. శోభాయాత్ర ధర్మశాల నుంచి ప్రారంభం కాగా సిరిసిల్లా రోడ్డు, పాత బస్టాండ్, స్టేషన్ రోడ్డు, సుభాష్‌రోడ్డు, హరిజనవాడ, పెద్దబజార్, రైల్వేబ్రిడ్జి మీదుగా నిజాంసాగర్ చౌరస్తా, కొత్త బస్టాండ్ వరకు చేరుకుని ర్యాలీని ముగించారు. ఈ ర్యాలీలో వేలాదిగా వచ్చిన యువకులు భక్తి సాగర పాటలతో, నృత్యాలతో ముందుకు కదిలారు. అంగరంగ వైభవంగా యాత్రను చేపట్టడంతో వివిధ గ్రామాల నుంచి యువకులు పట్టణానికి చేరుకొని శ్రీరామ నామ స్మరణ, జోర్ సే బోలో ప్యార్ సే బోలో.., జై శ్రీరాం.. జై శ్రీరాం.., మేబీ బోలో తుమ్ బీ బోలో.. జై శ్రీరాం.. జైశ్రీరాం అంటూ జయ జయ ధ్వానాలతో, కాషాయపు జెండాలతో జిల్లా కేంద్రం మొత్తం మారుమోగింది. ఈ కార్యక్రమంలో హిందూవా హిని తెలంగాణ రాష్ట్ర ప్రముఖ్ లక్ష్మణ్, జిల్లా ప్రముఖ్ జిల్లా సాయికిరణ్, నగర అధ్యక్షుడు మదన్ తదితరులు పాల్గొన్నారు.





కామారెడ్డిలో శోభాయాత్ర నిర్వహిస్తున్న హిందూవాహిని సభ్యులు



మాట్లాడుతున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

సీతారామచంద్ర స్వామి కల్యాణం చూడటం మనందరి అదృష్టం

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు

రామారెడ్డి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణం చూడటం మన అందరి అదృష్టమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అన్నారు. రామారెడ్డిలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఇక్కడే అరవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివానన్నారు. రామారెడ్డి గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ చూపుతానని అన్నారు. ఇటీవల గ్రామ అభివృద్ధికి పది లక్షల రూపాయల రోడ్డు నిర్మాణం కోసం పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ రంగు రవీందర్ గౌడ్, ఆలయ సూపరింటెండెంట్ బుర్ల ప్రభురాంచంద్రం గుప్తా, రామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, మండల వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు సామల శీలాసాగర్, అడ్లూర్ ఎల్లారెడ్డి విండో చైర్మెన్ సదాశివ రెడ్డి, వైస్ చైర్మెన్ అమ్ముల పశుపతి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు

ఘనంగా బీజేపీ వ్యవస్థాపక దినం

కామారెడ్డి టౌన్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా కార్యాలయం వద్ద భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినంను నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రతీ సామాన్యుడి నమ్మకాన్ని చూరగొంటుందని అన్నారు. శ్యాం ప్రసాద్ ముఖర్జీ వేసిన పునాదుల ద్వారా ఆవిర్భవించి దేశంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందని అన్నారు. దేశ నిర్మాణం కోసం ఎందరో మహానుభావుల నిస్వార్థత్యాగం, ఆత్మ బలిదానాలతో దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టడమే లక్ష్యంగా బీజేపీ ఆవిర్భవించిందని అన్నారు. ఏ లక్ష్యాల కోసం అయితే పార్టీ ఆవిర్భవించిందో ఆ లక్ష్యాల సాధన కోసం నరేంద్ర మోదీ సారథ్యంలో బీజేపీ ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు మురళీధర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు విపుల్‌జైన్, అసెంబ్లీ కన్వీనర్ లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్, నాయకులు రవీందర్, విఠల్, నరేందర్, వేణు, భరత్, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికున్‌గున్యా బాధితులకు మందుల పంపిణీ



వివరాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బిచ్కుంద, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని దౌల్తాపూర్‌లో చికున్‌గున్యాతో ప్రజలు బాధపడుతున్నారని 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం వచ్చిన వార్తతో వైద్యఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దౌల్తాపూర్ గ్రామంలో చికున్‌గున్యా బారినపడిన బాధితులకు ఇంటింటికీ తిరిగి మందులు పంపిణీ చేశారు. వారం రోజులుగా విషజ్వరాలతో కాళ్లు, చేతులు కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించి మందులను అందజేశారు. చికున్‌గున్యాను అదుపులోకి తెచ్చేందుకు సోమవారం దౌల్తాపూర్ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించి ప్రజలందరికీ రక్త పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ సిద్ధమైనట్లు సమాచారం.

బలోపేతం కానున్న మహిళా సంఘాలు

- మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోళ్లలో ప్రాధాన్యం
- ప్రభుత్వ తీరుపై మహిళా సంఘాల హర్షం
- 103 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- మహిళా సాధికారితకు న్యాయం

7



జిల్లా అంతటా ఘనంగా సీతారాముల కల్యాణం

బోధన్‌రూరల్‌,ఏప్రిల్‌6(ఆంధ్రజ్యోతి): బోధన్‌లో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బోధన్ పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలంలోని ఆయా గ్రామాలలో ఉన్న రామాలయాల్లో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌లో గల రామాలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య సీతారాముల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే భక్తులు బారులు తీరారు. ఉదయం నుండి ఆలయాల్లో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ స్వాములు, గురుస్వాములు హనుమాన్ చాలీసా పారాయణంతో జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. సీతారాముల కల్యాణాన్ని చూడడానికి చుట్టు పక్కల గ్రామాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. సీతారాముల కల్యాణాన్ని బోధన్ ఏసీపీ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవంలో పట్టణ ప్రముఖులు, మాజీ ప్రజాప్రతినిధులు, సంబంధితశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండలంతో పాటు వివిధ గ్రామాలలో ఆదివారం శ్రీరామనవమి వేడుకలు ప్రజలు భక్తి శ్రద్దలతో వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని రామాలయంతో పాటు , ఎస్సీ, బీసీ కాలనీలోని రామాలయంలో శ్రీరాముడి కల్యాణోత్సవాలను వైభవంగా జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు బారీ ఎత్తున పూజలు నిర్వహించారు.

డిచ్‌పల్లి:జిల్లాల్లో ప్రసిద్ది చెందిన ఖిల్లా రామాలయంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 11గంటలకు శ్రీరాముని జననంను పురోహితులు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సుమీత్ శర్మదేశ్‌పాండె ఆధ్వర్యంలో 12:01 గంటలకు శ్రీ సీతరాముల కల్యాణోత్సం నిర్వహించారు. ఈ వేడుకలకు రూరల్ ఎమ్మెల్యే డా.భూపతి రెడ్డి- వినోదిని దంపతులు హాజరయ్యారు. ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్ గుప్తా కుటుంబ సభ్యులు స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పిం చారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ ఛైర్మన్ శాంతయ్య జంగం, నాయకులు సాయిరెడ్డి, అమృతపూర్ గంగాధర్, శేఖర్ గౌడ్, శ్రీనివాస్, వీడీసీ సభ్యులు సాయిలు, సుదర్శన్, మహేందర్‌రెడ్డి, రాములు,నర్సారెడ్డి, లక్ష్మణ్, గ్రామస్థులు పాల్గొన్నారు. చారిత్రాత్మక ఖిల్లా డిచ్‌పల్లి రామాలయానికి సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలో తీసుకొస్తానని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్, ఛైర్మన్ శాంతయ్య ఉన్నారు. శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని 34 గ్రామాల్లో ని రామాలయాలు జైశ్రీరామ్ అంటూ భక్తుల ఆధ్యాత్మిక గీతాలతో మారుమోగి పోయాయి. ధర్మారం(బి) వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ప్రతినిధి రావుల బ్రహ్మానందం ఆధ్వర్యంలో సీతరాముల కల్యాణం వేద పండితులు రాహుల్ త్రిపాటి నిర్వహించారు.

ధర్పల్లి:మండలంలోని ఆయా రాముల వారి దేవాలయాల్లో సీతారాముల కళ్యాణోత్సవం కన్నుల పండుగగా ఆదివారం జరిగింది. మండల కేంద్రంలోగల రామాలయంలో ఆలయ కమిటీ, హనుమాన్ భక్తులు, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

మోస్రా: చందూర్, మోస్రా మండల కేంద్రాల్లో, అదే విధంగా మండలాల్లోని తిమ్మాపూర్, లక్ష్మాపూర్‌తో పాటు అన్ని గ్రామాల్లో శ్రీ రామాలయంలో ప్రత్యేక పూజలు చేసి సీతారామచంద్రుల కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా చందూర్ మండల కేంద్రంలో రామాలయం వద్ద పాఠశాల విద్యార్థులతో ఆడించిన ప్రత్యేక కోలాటం భక్తులందరిని ఆకట్టుకుంది. అనంతరం అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మోస్రా మండల భక్తులు, చందూర్ మండల భక్తులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

భీమ్‌గల్:పట్టణ కేంద్రంలోని మోక్షనంద ఆశ్రమంలో సర్వ సమాజ్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వర్ణాలంకరణ భూశితులైన శ్రీసీతారాముల దేవతామూర్తులను భక్తులు రామ రామ నామస్మరణలతో కళ్యాణ మండపం నందు ఆసీనులను చేసి అర్చకుల వేదమంత్రాలు భాజా భజంత్రీల నడుమ పురోహితులు మాంగళ్యధారణ గావించారు.ఈ కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ అధ్యక్షుడు నీలం రవి, ఉపాధ్యక్షుడుమోహన్, కార్యదర్శి నవీన్; హరీష్, మూడు సంఘాల పెద్దమనుష్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాల యం ఆవరణలోని నాగలింగేశ్వరాలయంలో, రామ్‌నగర్‌లోని రామాలయంలో ఆదివారం శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాగలింగేశ్వరాలయంలో ఆలయ కమిటి ఆధ్వర్యంలో యజ్ఞం నిర్వహించి సీతారాముల కళ్యాణాన్ని జరిపించి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి నాగలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాగలింగేశ్వరాలయ ఆలయ కమిటి ప్రతినిధులు సత్యశ్రీనివాస్, రాజయ్య, రమణ, కలిగోట గంగాధర్, స్వామి, రెడ్డి ప్రకాష్, అంబిక రమేష్, బాలోజీ, నారాయణ, రాజేందర్ పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో:పట్టణంలోని రామ్‌నగర్‌లో ఆలయ కమిటి ఆధ్వర్యంలో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు కొక్కుల లింగం, గుద్దెటి రమేష్, గంగమోహన్ చక్రు, విఠోభ శేఖర్, కర్తన్ నవీన్, చరణ్, రాజు, ఈఆర్ ఫౌండేషన్ సభ్యులు అర్గుల్ సురేష్, రాంప్రసాద్, రాంచెందర్, ప్రమోద్, శ్రీకాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండలంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని కోటగిరి, ఎత్తొండ, ఎక్లాస్‌పూర్, కొత్తపల్లి, అడ్కాస్‌పల్లి గ్రామాలలో రామాలయాల్లో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ఆలయాల్లో భక్తులుపూజలు నిర్వహించారు. పోతంగల్ మండలంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండలంలోని పలు గ్రామాల్లోని రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతంగల్ రామాలయంలో శ్రీరామ జన్మదినం, సీతారాముల కల్యాణ మహోత్సవం, పల్లకి సేవ వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రుద్రూరు మండలంలో ఆదివారం శ్రీరామ నవమి వేడు కలు ఘనంగా నిర్వహించారు. రుద్రూరు, రాయకూర్ క్యాంప్, సిద్దాపూర్ క్యాంప్, అక్బర్‌నగర్, సులేమాన్ నగర్, అంబం, లక్ష్మీపూర్ క్యాంప్ గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలు కన్నుల పండువగా సాగాయి. సులేమాన్ నగర్‌లో శ్రీరామ నవమిని పురస్కరించుకుని హనుమాన్ మాలధారులు ఆంజనేయ స్వామి ఆలయం నుంచి రామాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని అన్ని గ్రామాలలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ప్రజలు, భక్తులు భక్తి శ్రద్దలతో ఘనంగా జరుపుకున్నారు. కలిగోట్‌లో సీతారామాలయంలో సీతారాముల కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా కన్నుల పండుగగ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలిగోట్ విడిసి సభ్యులు, ఆలయ కమిటి సభ్యులు , భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మెండోరా:మండలంలోని పోచంపాడ్ శ్రీ కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌రెడ్డి దంపతులు స్వామివారికి నూతన వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ప్రశాంత్‌రెడ్డి దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిరవహించి స్వామి వారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ నాగంపేట్ శేఖర్, కమలాకర్, అనిల్ సాగర్‌రెడ్డి, సతీష్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:కమ్మర్‌పల్లి మండ వ్యాప్తంగా ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు అత్యంత భక్తి శ్రద్దలతో అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని జంబిహనుమాన్ ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణోత్సవాం ఆంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు భక్తులు పెద్దసంఖ్యలో హజరై పూజల్లో పాల్గొన్నారు.

మోపాల్: మోపాల్ మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం శ్రీరామ కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి కుటుంబ సమేతంగా కల్యాణోత్స వంలో పాల్గొన్నారు. అలాగే మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, బాడ్సి, బోర్గాం(పి), కంజర, కులాస్‌పూర్ వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నిజామాబాద్ కల్చరల్:శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయాల్లో ఘనంగా వేడుకలు జరిపారు. ఆదివారం నగరంలోని ప్రసిద్ధిచెందిన పెద్ద రాంమందిర్‌లో భక్తులు రామునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉయ్యాలలో రాముని ఉత్సవ విగ్రహాన్ని ఉంచి నామకరణం చేశారు.జిల్లా కేంద్రం లోని ఆర్యనగర్ రామాలయం, పోచంపాడ్ రామాలయం, బోధన్ శక్కర్‌నగర్ రామాలయం, పడిగల్ రామాలయం, కిసాన్‌నగర్ రామాలయం, కోటగిరి రామాలయం, ఆర్మూర్ రామాలయం, వర్ని రామాలయాల్లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు.

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బీజేపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం పార్టీ జెండాను మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో , బీజేపీ నాయకులు గంగారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరికొండ: శ్రీరామ నవమీ సందర్భంగా సిరికొండ మండలంలోని రామడుగు,కొండూర్, సిరికొండ,గడ్కోల్,న్యావనంది గ్రామాల్లో గల ఆలాయాల్లో సీతారాముల కళ్యాణ మహోత్సవం ఘనంగాజరుపుకున్నారు. సిరికొండలో గల శ్రీలొంకరామలింగేశ్వర స్వామి ఆలాయంలో సీతా రాముల కళ్యాణాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు.

మోపాల్: మాదవనగర్ సాయిబాబా ఆలయంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సాయిబాబా జన్మదినం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక అలంకరణ, పూజా కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీరాముని కళ్యాణం కూడా అంగరంగ వైభవంగా సాయిబాబా ఆలయ ప్రాంగణంలో నిర్వహించారు.

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నవీపేట, అంజుమాన్ ఫారం, కమలాపూర్, అభంగపట్నం, నిజాంపూర్, జన్నేపల్లి, నాగేపూర్, బినోల తదితర గ్రామాలల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ముప్కాల్:మండలంలోని రెంజర్ల గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకొని కోదండరామాలయంలో ఆదివారం సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ఆవరణలో కళ్యాణం కోసం ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతారాముల కళ్యాణం బాజా భజంత్రీల మధ్య వైభవోపేతంగా నిర్వహించారు.

రెంజర్ల కోదండ రామ కళ్యాణంలో పాల్గొన్న ఈరవత్రి అనిల్ ...

రెంజర్ల కోదండ రాముని కళ్యాణోత్సవంలో టీజీఎండిసి ఛైర్మన్ ఈరవత్రి అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు ప్రత్యేకంగా స్వాగతం పలికి శాలువ తో సత్కరించారు. అనంతరం సీతారామున్ని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు మద్దిరి ముత్యంరెడ్డి, చిన్నరెడ్డి, సంద రవి తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: శ్రీరామ నవమి పురస్కరించుకొని ఆదివారం ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై ఆలయ కమిటి ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం కన్నుల పండుగగ నిర్వహించారు. వేద పండితులు గోపి శర్మ, సిద్దుల గుట్ట ఆస్థాన పండితులు కుమార శర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారా ముల కళ్యాణంలో ఆర్మూర్, చుట్టు ప్రక్కల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సాయి చైతన్య సీతారాములను దర్శించుకొని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ వారు ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెంజల్: తండ్రి మాటను జవదాటని ఆదర్శమూర్తి శ్రీరాముడని, శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని తాడ్‌బిలోలి, నీలా, కందకుర్తి, రెంజల్, దూపల్లి, కళ్యాపూర్ గ్రామాలలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సాయిరెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్, సుధాకర్, జగన్ రెడ్డి, దత్తురెడ్డి, దత్తు పటేల్, గంగాధర్, అబ్బన్న, యోగేష్, నర్సారెడ్డి, అశోక్, ప్రవీణ్, పురోహితులు శ్రీనుపటేల్, తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ కల్చరల్: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సారంగపూర్‌లోని హరిహరాత్మక బాలాక రామ్ రామానంద ఆశ్రమంలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఎడపల్లి: ఎడపల్లి మండల కేంద్రంతోపాటు మండలంలోని పోచారం, జైతాపూర్, ఏఆర్పీ క్యాంపు, ఠానాకలాన్ గ్రామాలలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వర్ని: వర్ని మండలంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శ్రీరామ మందిరంలో శ్రీ సీతారామ కల్యాణం నిర్వహించారు.


బోధన్ సీతారాముల కల్యాణంలో పూజలు నిర్వహిస్తున్న ఏసీపీ


అంజుమాన్ ఫారంలో..


కోటగిరిలో...


మోస్రాలో..


ధర్పల్లిలో..


భీమ్‌గల్‌లో సీతారాముల కల్యాణం దృశ్యం


పెద్ద రాంమందిర్‌లో డోలారోహణం చేస్తున్న దృశ్యం


నగరంలో కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


శివాజీనగర్ రామాలయంలో పాల్గొన్న భక్తజనం


ఇందూరు తిరుమలలో మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు


శ్రీనగర్‌లో పూజలు చేస్తున్న రవీందర్‌రెడ్డి


పోచారంగ్రామంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


కోదండ రామాలయంలో అనిల్ కుమార్


కొండూర్‌లో ..


తాడ్‌బిలోలిలో..


కలిగోట్‌లో..

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఇందల్వాయి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేషన్ తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఐకేపీ సువర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న కనీస మద్దతు ధర ఏగ్రేడ్ వరి ధాన్యానికి రూ.2320, బీగ్రేడ్ ధాన్యానికి రూ.2300 మద్దతు కల్పిస్తున్నామని అన్నారు. రైతులు వరిధాన్యాన్ని 17 శాతం తేమ కలిగిన వరి ధాన్యాన్ని తీసుకురావాలని రంగు మారిన ధాన్యం 5 శాతం ఉండేలా చూడాలని, బాగా ఎండబెట్టి నేచర్ వచ్చిన తర్వాతనే కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకురావాలన్నారు. పది పదిహేను రోజుల్లో రైతు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం సువర్ణ, మాజీ సర్పంచ్ మోహన్ నాయక్, మాజీ ఎంపీటీసీ బాబురావు, వాల్యానాయక్, గ్రామ సంఘం అధ్యక్షురాలు అగ్గు లక్ష్మి, రాజ్యలక్ష్మి, కార్యదర్శులు వడ్ల శ్రావణి, దామ జ్యోతి, సీసీ ఉదయ్, రవినాయక్, జగత్‌నాయక్, వీవోఏలు మమత, సౌమ్య పాల్గొన్నారు.

నందిపేట : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు కోరారు. ఆదివారం మండలంలోని కంఠం గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ పెంట ఇంద్రుడు మాట్లాడుతూ ఏ గ్రేడు(దొడ్డు రకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2,320, బి గ్రేడు(సన్న రకం) వరిధాన్యం క్వింటాలుకు రూ.2,300 ధర ప్రభుత్వం చెల్లింస్తుందని తెలిపారు.

దర్పల్లి: ఇటీవల కురిసిన వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ధర్పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆర్మూర్ చిన్నబాల్‌రాజ్ అన్నారు. ఆదివారం మండలంలోని దుబ్బాక, ఎస్‌టీ తాండా, సీతాయిపేట్, గుడితాండా, గోవింద్‌పల్లి గ్రామాల్లో ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధైర్యపడవద్దని వడగండ్ల వాన, అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను ఇప్పటికే అధికారులు సర్వే నిర్వహించారని నష్టపరిహారం అందేవిధంగా నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏగ్రేడ్ ధాన్యానికి రూ.2350, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2300, సన్నానికి 500 రూపాయల బోనస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తుందన్నారు.

కందకుర్తిలో కుస్తీపోటీలు

రెంజల్,ఏప్రిల్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందకుర్తి గ్రామంలో ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని కుస్తీపోటీలను నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలో కుస్తీపోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, ఈ సంవత్సరం కూడా కుస్తీపోటీలు నిర్వహించారు. కుస్తీపోటీలలో పాల్గొనేందుకు మల్లయోధులు భారీ సంఖ్యలో తరలివచ్చి కుస్తీపోటీలలో పాల్గొన్నారు. కుస్తీపోటీలలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. చివరి విజేతలకు 10తులాల వెండి కడియాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కలీం బేగ్, మాజీ ఉప సర్పంచ్ యోగేష్, రమేష్, ఫెరోజ్, నాగభూషణం, సిరాజ్, గయాస్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

మోస్రా : మండలంలోని గోవూర్ గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా ఆనవాయితీగా కొనసాగుతున్న కుస్తీపోటీలు ప్రశాంతంగా ముగిశాయి. చుట్టు పక్కల గ్రామాల నుంచి మల్లయోధులు, మహరాష్ట్ర, కర్నాటక నుండి మల్లయోధులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడు, సంఘం సభ్యులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కోటగిరి :మండల కేంద్రంలోని వినాయక్ నగర్‌కాలనీలో ఆదివారం కుస్తీపోటీలు నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని గ్రామంలోని మీదిగల్లీ ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుస్తీపోటీలు ఏర్పాటు చేశారు. కుస్తీపోటీలలో ప్రతిభను చాటేందుకు చుట్టు పక్కల మండలాల నుంచి పెద్ద ఎత్తున కుస్తీవీరులు తరలివచ్చి తమ ప్రతిభను చాటారు. పోటీలలో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు

సైబర్ మోసంపై బాధితుడి ఫిర్యాదు

నవీపేట,ఏప్రిల్‌6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సుభాష్‌నగర్ కాలనీకి చెందిన సైబా వెంకటేష్ 70 వేల రూపాయలను పోగొట్టుకున్నాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. మండల కేంద్రంలోని బాసర రోడ్డులో ఉన్న పెట్రోల్ బంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్న వెంకటేష్‌కు గత నెల 31న వాహనంలో డీజిల్ పోయగా 3370రూపాయలు తనకు ఫోన్‌పే ద్వారా కస్టమర్ పంపించాడు. ఈ నెల 1న డ్యూటీ ముగించుకునే సమయంలో సంబంధిత డబ్బులను తన యాజమానికి ఫోన్‌పే ద్వారా పంపించడానికి యత్నించగా డబ్బులు వెళ్లలేదు. దీంతో అతడు కస్టమర్ కేర్‌కు ఫోన్ చేసి వివరాలు అడిగాడు. కొద్దిసేపటి తర్వాత కస్టమర్ కేర్ నుంచి తాము మాట్లాడుతున్నామని ఫోన్ వచ్చిందని, తాము చెప్పిన విధంగా మీ ఫోన్ ఆపరేట్ చేస్తే డబ్బులు ఫోన్‌పే ద్వారా ట్రాన్స్‌ఫర్ అవుతాయని వివరించారు. దీంతో వెంకటేష్ అవతలి వ్యక్తులు చెప్పిన విధంగా తన ఫోన్‌ను ఆపరేట్ చేయగా తన బ్యాంకు ఖాతాలో ఉన్న 70వేల రూపాయలు ఖాళీ అయ్యాయని ఆయన వివరించారు. 2వేల రూపాయలు, 20వేల రూపాయలు, 48వేల రూపాయల చొప్పున మూడుసార్లు తమ ఖాతా నుంచి డబ్బులు ఖాళీ కావడంతో బాధితుడు సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశాడని, ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించాడు. ఈ నెల 4న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'సైబర్ నేరగాళ్ల మోసంతో రూ.70వేలు ఖాళీ' అనే వార్తను ప్రచురించిన విషయం విదితమే.

చలివేంద్రం ప్రారంభం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలో మర్వాడీ సమాజ్ ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ప్రయాణికులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం కూడా తాగునీటి సౌకర్యాన్ని కల్పించామని మర్వాడీ సమాజ్ నాయకులు తెలిపారు. మాజీ కౌన్సిలర్ దాము, మర్వాడీ సమాజ్ ప్రతినిధులు చలి వేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మర్వాడీ సమాజ్ ప్రతినిధులు తదితరులున్నారు.

వీడీసీ సభ్యులు, పురోహితుడిపై కేసు నమోదు

మోర్తాడ్ , ఏప్రిల్ 6(ఆంధ్ర జ్యోతి):ఏర్గట్ల మండలం తాళ్ళరాం పూర్ గ్రామ కమిటీ సభ్యులపై, రామాలయ పూజారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని గ్రామం లోని కోదండ రామాలయంలో ఒకరోజు ముందు కుంకుమార్చణ జరగడం ఆనవాయితీ. దీంతో గౌడ సంఘానికి చెందిన మహిళలు శనివారం కుంకుమార్చనకు ఆలయం లోకి వెళ్లగా పూజారి గౌడ మహి ళల దగ్గరకు వెళ్ళి ఆలయం నుంచి బయటకు వెళ్ళాలని చెప్పారు. గ్రామ కమిటీ సభ్యులు మీరు ఆలయం వెళ్తేనే కుంకుమార్చన జరిపిస్తామని కరాకండిగా చెప్పడంతో చివరకు మహిళలు వెనుదిరిగారు. అయితే గ్రామంలో కొన్ని నెలల క్రితం గ్రామ కమిటీ సభ్యులు గీతాకార్మికులను బహిష్క రించారు. వీడీసీ కమిటీకి గౌడ సంఘం మధ్యన కొన్ని నెలల నుంచి వివాదం కొనసాగుతోంది. అయితే ఇటీవల వివాదం సద్దు మనిగిందని భావించిన గీతా కార్మికులు శ్రీరామనవమి ఉత్సవా లకు పాల్గొనేందుకు సిద్ధమయ్యారు. మహిళలు కుంకుమార్చనకు వెళ్ళగా ఆలయం నుంచి వెళ్ళగొట్టడంతో మహిళలు అవమాన భారంతో ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌కు తరలి వెళ్ళారు. పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించారు. దీంతో పోలీసులు స్పందించి గ్రామ కమిటీకి చెందిన ముగ్గురు సభ్యులపై, ఆలయ పూజారిపై కేసులు నమోదు చేశారు. జిల్లా స్థాయి గౌడ సంఘం నాయకులు ఈ సంఘటన పట్ల ఆదివారం స్థానిక గౌడ సంఘం నాయకులతో మాట్లాడారు. తదుపరి కార్యాచరణ రూపొందిస్తామన్నారు.

'ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి'

కోటగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం తలపెట్టిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. రుద్రూరు మండలంలోని చిక్కడ్‌పల్లి, రాణంపల్లి గ్రామాలలో ఆదివారం జైబాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాలలో అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోట అరుణ్, నాగేష్, మహబూబ్, నితిన్ పటేల్, రవి, చంటి, బాలరాజు, షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.


బాన్సువాడ మండలంలో సీతారాముల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి


సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దంపతులు


పోచంపాడ్‌లో సీతారాముల కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి దంపతులు


మద్నూరులో రామచంద్రయ్య ఆలయ కమిటీ సభ్యులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే


సుభాష్‌నగర్ రామాలయంలో పూజలు చేస్తున్న సీపీ సాయిచైతన్య

వైభవంగా సీతారాముల కల్యాణం

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో ఆదివారం శ్రీరామ నవమిని పురస్కరించుకొని వేద పండితుల మంత్రోశ్చరణలతో సీతారాముల కల్యాణాన్ని కమనీయంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణ తంతును నిర్వహించారు. పలు ఆలయాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

● (ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)


తాడ్వాయిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే


బాన్సువాడ పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు


భిక్కనూరులో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


ఖిల్లా రామాలయంలో గంగోత్రి రామానుజదాసు, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్


సుభాష్‌నగర్ రామాలయంలో పూజలు నిర్వహిస్తున్న జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

బలోపేతం కానున్న మహిళా సంఘాలు

● మహిళా సంఘాలకు ధాన్యం కొనుగోళ్లలో ప్రాధాన్యత ● ప్రభుత్వ తీరుపై మహిళా సంఘాల హర్షం
● నియోజకవర్గంలో 103 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ● మహిళా సాధికారితకు న్యాయం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): స్వయం సహాయక మహిళ సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం యాసంగి సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ఐకేపీ సంఘాల ద్వారా 50శాతానికి పైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను కేటాయించాయి. మాజీమంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి నియోజకవర్గంలో జరిగిన మహిళ సంఘాలను బలోపేతం చేస్తేనే కుటుంబాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పలుమార్లు ప్రకటించారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం సగానికి పైగా కొనుగోలు కేంద్రాలను మహిళ సంఘాలకు కేటాయించారు. బోదన్ నియోజకవర్గంలో సుమారు 103 వరి కొనుగోలు కేంద్రాలు ఉండగా వీటిలో సగానికి పైగా 58వరి కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు అప్పగించారు. సుమారు 45కేంద్రాలను సహకార కేంద్రాలకు అప్పగించారు. దీంతో మహిళ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సన్న ధాన్యానికి క్వింటాలుకు 500రూపాయల బోనస్‌ను దృష్టిలో పెట్టుకుని వానాకాలం సీజన్ నుండి దొడ్డు, సన్న రకం కొనుగోలు కేంద్రాలు వేర్వేరుగా నిర్వహించనున్నారు. దొడ్డు, సన్న రకం వరి ధాన్యాన్ని విడివిడిగా కొనుగోలు చేసి ట్యాబ్ ఎంట్రీ చేసి మిల్లులకు తరలించి రైతులు అధికారుల చుట్టూ తిరగకుండా వారి ఖాతాల్లో డబ్బులు జమ చేయాల్సి ఉంది. రైతులు కూడా కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధరతో పాటు బోనస్‌ను పొందే అవకాశం ఉంది. నియోజకవర్గంలో మహిళ సంఘాలు ఈసారి దొడ్డు రకం, సన్న రకం వడ్లను కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు చేయడానికి సిద్ధమయ్యారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎండలు మండుతున్నందున మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో వరికోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం కొనుగోలుకు కావాల్సిన హమాలీలు తేమను కొలిచే, తూకం వేసే యంత్రాలతో పాటు అవసరమైన సామాగ్రిని మహిళా సంఘాలు సమకూర్చుకుని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరిస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఐకేపీ మహిళా సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈసారి బోనస్‌ను దృష్టిలో పెట్టుకుని యాసంగి సీజన్‌లో నియోజకవర్గంలోని వేల ఎకరాలలో సన్నరకం వరి ధాన్యాన్ని గణనీయంగా రైతులు సాగు చేశారు. ప్రతీ రైతు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాన్ని ఆశ్రయించనున్నారు. కాబట్టి అనుభవం లేని మహిళా సంఘాల వారు ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ నిబంధనలు పాటించి విజయవంతం అవ్వడానికి కృషి చేస్తున్నారు.

● సహకార సంఘాలకు కష్టకాలమేనా..!?

కొనుగోలు కేంద్రాల ద్వారా వచ్చే కమిషన్ డబ్బులతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అభివృద్ధి పథంలో నడిచాయి. ఇప్పుడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అభివృద్ధికి దూరం కానున్నాయి. వరి ధాన్యం


నవీపేటలో ఐకేపీ ద్వారా వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

కొనుగోలు కేంద్రాల ద్వారా నియోజకవర్గంలోని బోధన్, ఎడపల్లి, నవీపేట, రెంజల్ మండలాల్లో సహకార సంఘాలకు సుమారు కోటి రూపాయల వరకు ఆదాయం సమకూరేంది. ఇలా వచ్చే కమీషన్‌తో సిబ్బంది జీతభత్యాలతో పాటు గోదాములు, సంఘం నూతన భవనాలు నిర్మించుకుని ఫర్టిలైజర్, పురుగుల మందులను నిల్వ చేసుకునే వారు. కొనుగోలు కేంద్రాలను ఐకేపీ మహిళలకు అప్పగించడంతో ఆదాయ మార్గాలు లేక సోసైటీలకు కష్టకాలం రానుంది. మూడు సోసైటీల పరిధిలో సుమారు 15గోదాములను లక్షలు వెచ్చించి ఫర్టిలైజర్ నిల్వ చేసుకోవడానికి నిర్మించారు.

● మహిళా సాధికారత కోసం

ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మహిళా సంఘాలకు, సోసైటీలకు క్వింటాలుకు సుమారు 32 రూపాయల కమీషన్ వస్తుండడంతో అభివృద్ధి బాటలో కొనసాగుతున్నాయి. ముఖ్యంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సీజన్‌కు కోటి రూపాయల వరకు ఆదాయం ఆర్జిస్తున్నాయి. పాలక వర్గానిదే పూర్తి బాధ్యత కావడంతో స్వలాభం కోసం కొన్ని సహకార సంఘాలు వ్యాపారుల పేరుతో అవసరం లేకున్నా గోదాములు, ఇతరత్రా అవకతవకలకు పాల్పడడం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి దృష్టికి రావడంతో ఆయన ప్రత్యేకంగా మహిళా సంఘాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో సగానికి పైగా ఐకేపీ సంఘాలకు బాధ్యతలు అప్పగించడంతో మహిళా సంఘాలు లక్షల్లో ఆదాయం పొంది ఎక్కువ అభివృద్ధి చెందనుండడంతో మహిళా సంఘాలు ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

● మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

మహిళ సంఘాల మహిళలు ఆర్థికంగా అన్ని రంగాలలో రాణించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం లాభదాయకమైన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను మహిళలకు అప్పజెప్పుతుంది. మహిళ సాధికారత కొరకే ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుంది.

తొర్లికొండలో వేంకటేశ్వర స్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో ఆదివారం వేంకటేశ్వర స్వామి దేవాలయం రథోత్సవం ఘనంగా నిర్వహించారు. రథోత్సవాన్ని గ్రామంలో ఊరేగింపుగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుల తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సంజీవ్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, విడిసి సభ్యులు, భక్తులు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్య సమాజ్‌లో యజ్ఞం

బోధన్‌రూరల్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని దయానంద ఆర్య సమాజ్‌లో శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలందరు ఆయురారోగ్యాలతో ఉండాలని, యజ్ఞ మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని గోశాల కమిటీ నిర్వాహకులు ప్రదీప్ గుప్తా, యోగా మాధవి, లడ్డు శ్రీనివాస్ పేర్కొన్నారు.


బోధన్ గోశాలలో యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

హనుమాన్ స్వాములకు వంట పాత్రలు వితరణ చేసిన మైనారిటీ నాయకులు

కోటగిరి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని హంగర్గ గ్రామంలో ఆదివారం హనుమాన్ స్వాముల మాలధారులకు ప్రముఖ సామాజిక సేవకర్త, మైనారిటీ ఎంఎ హకీం వంట పాత్రలు అందించారు. సుమారు 25వేల విలువ కలిగిన వంటపాత్రలు అందించి మతసామరస్యాన్ని చాటారు. ఈ సందర్భంగా హనుమాన్ స్వాములు ఆయనను ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఆంజనేయ స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నీరడి గంగాధర్ 51వేల రూపాయల చెక్కును ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ మాలధారులు తదితరులు పాల్గొన్నారు.


హంగర్గలో మైనారిటీ నాయకుడిని సన్మానిస్తున్న హనుమాన్ స్వాములు


తలంబ్రాల వేడుక

కల్యాణం.. కమనీయం..

భద్రాద్రిలో వైభవంగా సీతారాముల పరిణయం

దక్షిణ అయోధ్యగా భాసిల్లుతున్న భద్రాచలంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఈ వేడుకకు సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించగా పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

భక్తి పారవశ్యంలో సినీ నటి కొణిదెల నిహారిక


ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



కల్యాణ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు


టీటీడీ తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్ బీఆర్ నాయుడు


కల్యాణం అనంతరం తిరువీధి సేవకు బయలుదేరిన సీతారాములు


రామాలయంలో అర్చక బృందంతో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

ఆలయ అభివృద్ధికి నిధుల మంజూరు



ఆలయ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : ఆలయ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. ఆదివారం అంజనేయ స్వామి ఆలయ నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభి వృద్ధిని కోరుకుంటుందని గుర్తుచేశారు. మూడు రాష్ట్రాల సరిహద్దులో ఉన్న సలాబత్ పూర్ ఆంజనేయ స్వామి ఆలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని, రాష్ట్ర ప్రభుత్వం ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆలయానికి నూతనంగా ఎంపికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు సభ్యులకు ఆయన సన్మానించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చరణలతో సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ పూజారి వేణు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



సీసీకెమెరాలు ప్రారంభిస్తున్న ఏఎస్పీ

మాచారెడ్డి,ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): సీసీకెమెరాలతో నేరాలు నియంత్రించవచ్చని ఏఎస్పీ చైతన్యరెడ్డి అని అన్నారు. ఆదివారం గజ్యానాయక్ చౌరస్తాలో సీసీకెమెరాలు ప్రారంభించారు. సీసీకెమెరాలు నేరాలు జరిగిన వ్పుడు ఎంతో తోడ్పాటును అందిస్తాయని తెలిపారు. మండలంలో ప్రతి గ్రామంలో సీసీకెమెరాలు ఏర్పాటుకు ప్రతి ఒక్కరు సహకరించి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ అనిల్ పాల్గొన్నారు.

ఆరేపల్లిలో చోరీ

మాచారెడ్డి,ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన ఎర్రగొల్ల నడిపి సాయిలు ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ అనిల్ తెలిపారు. శనివారం రాత్రి సాయిలు తన భార్యతో కలిసి పక్కనే ఉన్న తన కొడుకు ఇంట్లో పడుకున్నాడు. ఆదివారం ఉదయం 6 గంటలకు తన ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉంది. మూడు తులాల బంగారు పుస్తెలతాడు, రూ.20 వేల నగదు దొంగలించుకుపోయారని గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరివేసుకుని ఒకరి ఆత్మహత్య

మండలంలోని చందునాయక్ తండాకు చెందిన బింగి ధర్మపురి ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడని ఎస్ఐ అనిల్ తెలిపారు. 10 సంవత్సరాల క్రితం మద్దికుంట గ్రామానికి చెందిన జమునతో వివాహం జరిగింది. పిల్లలు పుట్టకపోవడంతో ఐదు సంవత్సరాల క్రితం జమున తన పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మద్యానికి బానిసైన ధర్మపూరి జులాయిగా తిరుగుతూ ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈనెల 5 న రాత్రి ఇంట్లో కాలకృత్యాలకు వెళ్తున్నానని చెప్పి గ్రామంలోని వాటర్ ట్యాంక్ మెట్ల పట్టికి చున్నితో ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

తాడ్వాయి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎల్లారెడ్డి ఎస్సీ సెల్ అధ్యక్షులు గైని శివాజీ అన్నారు. అనంతరం రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాలను మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కామారెడ్డి రక్తదాతల సమూహ ఫౌండర్, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ బాలు, అధ్యక్షులు జమీల్ హైమద్‌లు మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటరమణ, వెంకట్ రెడ్డి, బండారి సంజీవులు, శివాజీ, సంజీవులు, అఖిల్ రావు మహిపాల్, చిరంజీవి, నరేష్, సంతోష్, వినయ్, గపూర్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ నాయక్‌పోడ్ మండల కమిటీ ఎన్నిక

మహమ్మద్‌నగర్,ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): మహమ్మద్‌నగర్ మండల ఆదివాసి నాయక్‌పోడ్ నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సాయిలు, ప్రధానకార్యదర్శిగా రవీందర్, సభ్యులు సాయిలు, భూమయ్య, నారాయణ, శివకుమార్, రాములు,రేఖలతో కూడిన కమిటీని ఏర్పాటుచేశారు. కమిటీ సమస్యలపై నిరంతరం పోరాటం చేయాలని జిల్లా అధ్యక్షుడు పెంటయ్య సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాక్షుడు సాయిలు, కోశాధికారి సాయిబాబా, ప్రధానకార్యదర్శి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



బాన్సువాడలో పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు



లింగంపేటలోని బాణాపూర్‌లో..



తాడ్వాయిలో..



రామారెడ్డిలో మజ్జిగ పంపిణీ చేస్తున్న పోలీసులు

బాన్సువాడటౌన్/బాన్సువాడ ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాముడు అందరికీ ఆదర్శప్రాయుడని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రీరామ ఆలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిపించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆగ్రోఇండస్ట్రీస్‌చైర్మన్ కాసుల బాల్‌రాజ్ తదితరులున్నారు. బాన్సువాడ మండలం దేశాయిపేట రామాలయం, కొల్లూరు రామాలయం, తిర్మలాపూర్ రామాలయం, బీర్కూరు మండల కేంద్రంలోని రామాలయం, స్వగ్రామం పోచారం రామాలయాలలో జరిగిన సీతారాముల కళ్యాణంలో సతీమణి పుష్పతో కలిసి ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు పోచారం శంభు రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి, బాన్సువాడ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. బాన్సువాడ పట్టణమంతా జైశ్రీరాం అనే నినాదంతో మార్మోగింది. ఆదివారం సాయంత్రం హిందూసంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

లింగంపేట : మండలంలోని లింగంపేట, బాణాపూర్, భవానిపేట, పొల్కంపేట, మెంగారంలతో పాటు పలు గ్రామాలలో ఆదివారం సీతారాములోరి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. మండల కేంద్రంలోని రామాలయంలో ఆలయధర్మకర్త విజయ్‌గుప్త ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించగా, వైశ్యసంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం రథోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలియజేశారు.

తాడ్వాయి : మండలంలోని చిట్యాల, ఎర్ర పహాడ్, కన్కల్, తాడ్వాయి గ్రామాలలో సీతారాముల కల్యాణాన్ని అంగరంగవైభవంగా జరిపించారు. ఆయా గ్రామాల్లో సీతారాముల విగ్రహాలను వీధుల గుండా ఊరేగించుతూ ఆటపాటలతో రామ నామ స్మరణతో మారు మోగిపోయాయి. మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో సీతారాముల కల్యాణం కన్నుల పండుగగా నిర్వహించారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు శ్రీరామనవమిని పురస్కరించుకొని మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న దేవాలయాలను సందర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. శబరిమాత ఆశ్రమంలో వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు.

రాజంపేట : మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీరాముల వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు స్వామివారికి ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కల్యాణ అనంతరం ఆలయ సమీపంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీబీపేట : బీబీపేట మండల కేంద్రంతో పాటు యాడారం, మల్కాపూర్, ఇస్సానగర్, ఉప్పర్‌పల్లి, మందాపూర్, జనగామ, తూజాల్‌పూర్, శేరిబీబీపేట తదితర గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, ఆయా గ్రామాల నాయకులు పురోహితులు, హనుమాన్ మాలధారణభక్తులు, రామాలయాలు, హనుమాన్ ఆలయాల వద్ద కల్యాణం జరిపించి పలు గ్రామాలలో దేవాలయాల నిర్వాహకులు కమిటీల ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు.

సదాశివనగర్ : మండల కేంద్రంతో పాటు అడ్లూర్ ఎల్లారెడ్డి, పద్మాజీవాడి, ఉత్తునూర్, కుప్రియాల్ గ్రామాలలో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సదాశివనగర్ కుప్రియల్ రామాలయంలో రాముల వారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహాలను గ్రామంలోని వీధులలో ఊరేగింపు నిర్వహించి ఆలయాల వద్ద ఏర్పాటుచేసిన ముత్యాల పందిరిలో వేద పండితుల మంత్రోత్సవాలతో ఘనంగా కల్యాణం నిర్వహించారు.

రామారెడ్డి : మండలకేంద్రంలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఆదివారం భక్తులకు తీర్థ ప్రసాదాలను, మజ్జిగను ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై నరేష్, ఆలయ కమిటీ చైర్మెన్ రంగు రవీందర్ గౌడ్, వివేకానంద ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిటౌన్ : శ్రీరామనవమిని పురస్కరించుకుని కామారెడ్డి జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో శ్రీరామనవమి వేడుకలు, సరస్వతి విద్యాపీఠం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రతాప్‌గౌడ్, వి.టిలాల్, సామల గంగారెడ్డి, సిరిగాధశంకర్, ఎస్.ఎన్‌చారీ,రాజన్న, ఆచార్య శ్రీరాజలింగం, అకాడమిక్ ప్రిన్సిపల్ నాగేష్ పాల్గొన్నారు.

బిచ్కుంద : శ్రీరామనవమి సందర్భంగా గ్రామగ్రామన శ్రీరాముని కల్యాణమహోత్సవాన్ని కన్నుల పండుగగా నిర్వహించారు. మండల కేంద్రంలోని మింజార బాలాజీ మందిరం నుంచి సీతారాముల కల్యాణమహోత్సవం సందర్భంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, బిచ్కుంద మఠాధిపతి సోమలింగాచార్యులతో కలిసి పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకునివచ్చారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, బీజేపీ జిల్లాఅధ్యక్షురాలు అరుణతార శ్రీరాముల వారిని దర్శించుకుని పూజలు ప్రజలందరూ బాగుండాలని కోరి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మల్లిఖార్జున్‌అప్ప శెట్కార్, నాయకులు విఠల్‌రెడ్డి, గంగాధర్, నాగనాథ్‌పటేల్, నౌషానాయక్, సొహెల్ శెట్కార్,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మహమ్మద్‌నగర్ : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శ్రీరామనవమి సందర్భంగా ఆయా ఆలయాల్లో పూజలు ఘనంగా జరిగాయి. స్వామివారి కళ్యాణంనువేద పండితుడు ప్రమోద్‌కుమార్ నిర్వహించగా మహిళలు, భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి : పట్టణ కేంద్రంలోని ఉన్న రామాలయంలో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో ఉదయం నుండి అభిషేకాలు అర్చనలు, పూజా కార్యక్రమాలు నిర్వహించి మధ్యాహ్నం సిద్ది పరివార్ కుటుంబ సభ్యులు వేద పండితుల సమక్షంలో సీతారాముల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

దోమకొండ :మండల కేంద్రంలోని శివరాంమదిర్, సీతారాంపూర్‌లో హనుమాన్ మందిర్ ఆలయంతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం శ్రీరామనవమి సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీతారాముల కల్యాణం నిర్వహించి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భిక్కనూరు : మండలకేంద్రంతో పాటుగా మండలంలోని గ్రామగ్రామాన శ్రీరామ నవమి వేడుకలను మండల ప్రజలు ఆదివారం భక్తిశ్రద్ధల నడుమ ఘనంగా జరుపుకున్నారు. మహిళలు స్వామివారికి ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. సిద్ధరామేశ్వరనగర్, రామేశ్వర్‌పల్లి గ్రామంలో స్వామివారి కళ్యాణానికి జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి దంపతులు పుస్తేమట్టెలు, తలంబ్రాలు, పట్టువస్త్రాలను అందజేశారు. కాగా ఆయాగ్రామాల్లో ఉత్సవ విగ్రహాలతో బ్యాండుచప్పుళ్ల నడుమ, యువకుల జై శ్రీరామ్ నినాదాలతో ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామ నవమి వేడుకల్లో బాగంగా గ్రామగ్రామాన పండుగ వాతవరణం నెలకొంది.

జుక్కల్: మండల కేంద్రంలో శ్రీరామనవమి పండుగను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. రామ మందిరంలో ఉదయం నుంచి భక్తులతో రామాలయాలు కిటకిటలాడినాయి. భజన కార్యక్రమంలో రామాలయాలు మార్మోగినాయి. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బీర్కూర్: మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో ఆదివారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. రాముల వారి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సీతారాముల కళ్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నిజాంసాగర్ : అంగరంగ వైభవంగా ఆదివారం సీతారాముల కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉమ్మడి మండలాల్లోని అచ్చంపేట, వడ్డేపల్లి, హసన్ పల్లి, నర్వా, కోమలంచ, సింగీతం గ్రామాల్లోని రామాలయాలలో పురోహితులు సీతారాముల కల్యాణాన్ని భక్తుల సమ్మేనాలతో ఘనంగా జరిపారు. రామాలయాల ఆవరణలో కళ్యాణానికి విచ్చేసిన భక్తులందరికీ అన్న ప్రసాదాన్ని అందజేశారు. కల్యాణంలో సంజీవ్ శర్మతో పాటు గ్రామాల ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మద్నూర్ : మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరము నుంచి సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జై శ్రీరామ్, జై జై శ్రీరామ్ నినాదంతో మండల కేంద్రం మారుమోగింది. మండల కేంద్రంలోని లక్ష్మీనారాయణ మందిరం, రామచంద్రయ్య ఆలయం, శ్రీ రాంనగర్ కాలనీలోని అంజనేయ స్వామి ఆలయంలో భక్తులు తెల్లవా రుజాము నుంచి బారులు తీరి రామయ్య దర్శనం చేసుకున్నారు. నూతనముగా మండల కేంద్రంలో ఏర్పా టు అయిన రామచంద్రయ్య ఆలయ కమిటీ సభ్యు లను జుక్కల్ మాజీ శాసనసభ్యురాలు శాలువాతో సన్మానించారు.

నాగిరెడ్డిపేట: మండల కేంద్రంలోని రామాలయంలో, తాండూరు గ్రామంలోని రామా లయంలో ఆదివారం సీతారాముల కల్యాణ మహో త్సవం కన్నుల పండుగ జరిగింది. మండల కేంద్రం లోని రామాలయంలో ఆలయ ధర్మకర్త మొలుగు అంజయ్య ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. సీతారాముల దేవతామూర్తులను పల్లకిలో ఊరేగింపు నిర్వహించారు.



దోమకొండలో సీతారాముల కల్యాణం



బీర్కూర్ రామాలయంలో ..



నిజాంసాగర్ అచ్చంపేటలో...



ఎల్లారెడ్డి రామాలయంలో..

బీజేపీతోనే ప్రజాసమస్యల పరిష్కారం

● జుక్కల్ మాజీ శాసనసభ్యురాలు అరుణతార



మద్నూర్‌లో బీజేపీ జెండావిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే

మద్నూర్, ఏప్రిల్ 6(ఆంధ్రజ్యోతి): : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జుక్కల్ మాజీ శాసనసభ్యురాలు అరుణతార బీజేపీ కార్యాలయం ఆవరణలో జెండా ఎగురవేశారు. ఈ సం దర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో సమస్యల పరిష్కారం భారతీయ జనతా పార్టీతోనే సాధ్యమవుతుం దన్నారు.

సదాశివనగర్ :మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయాగ్రామాలలో గ్రామ అధ్యక్షులు జెండాలను ఆవిష్కరించారు.

మహమ్మద్‌నగర్ : మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాయ కులు జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, రాష్ట్రంలోని బీజేపీ పార్టీ ప్రజలకు పోరాడుతున్న తీరును వివరించారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ శివాజీ పాటిల్, మండల అధ్యక్షుడు పోలీసురాజు, ప్రధానకార్యదర్శి సతీష్, శ్రీకాంత్,రాంప్రసాద్, రాజాగౌడ్ పాల్గొన్నారు.

గాంధారి : మండలకేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామారెడ్డి-బాన్సువాడ ప్రధానరహదారులపై బీజేపీ జెండాను ఆవిష్కరించారు. మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు మాట్లాడుతూ దేశంలో బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోడీ యావత్ భారతదేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకువెళ్తున్నారని తెలిపారు. బీజేపీ ఆవిర్భావం నుంచి ప్రజల మధ్యలో ఉంటూ ప్రజలకు ఎళ్లవేళలా సేవలు అందిస్తు ముందుకు సాగుతుందని తెలిపారు.

బిచ్కుంద : మండలంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయా గ్రామాలలో బీజేపీ నాయకులు జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాజీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార మాట్లా డుతూ పార్టీ ఎదుగుదల కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో విష్ణు, శ్రీధర్‌పంతులు, మల్లుదేశాయ్ పాల్గొన్నారు.

లింగంపేట : మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దత్తురాంలు, రాంచందర్, నవీన్, విష్ణు, సుభాష్, ఉదేశ్, భీమయ్య, సంతోష్, స్వామిగౌడ్‌లతో పాటు నాయకులు ఉన్నారు.

తాడ్వాయి: ప్రపంచ దేశాలే భారత్ వైపు చూసేలా బీజేపీ పరిపాలన కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మర్రి రామ్ రెడ్డి తెలిపారు. తాడ్వాయి మండల కేంద్రంలో ఆదివారం మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ 1980 సంవత్సరంలో ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ దేశంలోనే అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో పార్టీ ముందుకు దూసుకెళ్తుందని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మర్రి బాపురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు, నాయకులు హోటల్ శ్రీను, బిజెపి మండల అధ్యక్షులు సంతోష్ రెడ్డి, వెంకట్రావు, సదాశివుడు, రవి పాల్గొన్నారు.

దోమకొండ :మండల కేంద్రంలోని పాతబస్టాండ్ చౌరస్తా వద్ద ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి ఆదేశాల మేరకు వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు చింతల రాజేష్‌నాయకులు రవీందర్‌రెడ్డి, మనోజ్ కుమార్, అనుపాటి నరేందర్‌రెడ్డి, రవి, సుజాత, సిద్దరాములు, హరీష్, బాపురెడ్డి, రాము, రంజిత్, కిషోర్ పాల్గొన్నారు.

భిక్కనూరు: మండలకేంద్రంతో పాటుగా మండలంలోని ఆయాగ్రామాల్లో ఆదివారం బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లో పార్టీ నాయకులు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం మండల అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూఅందరం ఒకే కుటుంబసభ్యులమని, దేశ ప్రజలు బీజేపీతోనే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, నర్సారెడ్డి, బస్వారెడ్డి, అన్నిగ్రామాల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

బాన్సువాడ : పార్టీ కార్యాలయంలో బీజేపీ జెండాను బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బాన్సువాడ నియోజకవర్గ ఇంచార్జి యెండల లక్ష్మీనారాయణ ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, మాజీ అసెంబ్లీ కన్వీనర్ చీదర్ సాయిలు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

బీర్కూర్ : మండల కేంద్రంలోని కామప్ప చౌరస్తాలో ఆదివారం బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేశారు.



మహమ్మద్‌నగర్‌లో బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



దోమకొండలో..



బాన్సువాడలో...

పెద్దమ్మ, నల్ల పోచమ్మలకు ఘనంగా బోనాలు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భిక్క నూరు గ్రామంలో ఆదివారం పెద్దమ్మ, నల్ల పోచమ్మ అమ్మ వార్లకు గ్రామస్తులు వేరువేరుగా ఘనంగా బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు నూతన వస్త్రాలు ధరించి, అందంగా అలంకరించిన బోనాలను నెత్తిన పెట్టుకొని డీజే చప్పుళ్ల మధ్య శివ సత్తులు నృత్యాలతో ఊరే గింపుగా అమ్మవారి ఆలయాల వరకు వెళ్లారు. అనంతరం ఆలయాల చుట్టూ బోనాలు ఎత్తుకొని ప్రదక్షిణలు నిర్వహించి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ స్థులంతా సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని అమ్మ వార్లను వేడుకున్నట్లు తెలిపారు. మహిళలు పాల్గొన్నారు.

న్యూసెన్స్ చేసిన యువకులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి - రోడ్డుపై రాత్రి న్యూసెన్స్ చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి కామారెడ్డి ప్రధాన రోడ్డుపై శనివారం రాత్రి స్నేహితుని పుట్టిన రోజు జరుపుకుంటూ రోడ్డుపై బైక్ పెట్టి బైక్‌పై కేక్ ఉంచి, వాహనదారులకు, పాద చారులకు ఇబ్బంది కలిగేవిధంగా న్యూసెన్స్ సృష్టించిన యువకులను రాత్రి అదుపు లోకి తీసుకొని వారిపై న్యూసెన్స్ కేసు నమోదు చేశామన్నారు. ఆదివారం ఉదయం యువకుల తల్లి తండ్రులకు పోలీస్ స్టేషన్ వద్ద కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మహేష్ మాట్లాడుతూ ఎవరైనా రోడ్లపై పుట్టిన రోజు వేడుకల పేరుతో న్యూసెన్స్ చేస్తే చర్యలు తప్ప వన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - రాబిన్ హుడ్

ప్రియా 70 - స్టేట్ వర్సెస్ నోబడి

ప్రియా 35 - శారీ

బాన్సువాడ

మహేశ్వరి - మ్యాడ్ స్క్వేర్

వెంకటేశ్వర - ధీర వీర శూర

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	120	140	170
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

